క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

త్రిపురారం : స్థానిక 33కేవీ సబ్ స్టేషన్, పెద్దదేవులపల్లి 33కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు విద్యుత్ సిబ్బందికి సహకరించగలరని కోరారు.

నరహరి ఆశయ సాధనకు కృషి చేయాలి

మిర్యాలగూడ : సిరిసాల నరహరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నరహరి అన్నారు. బుధవారం మండలంలోని కాల్వపల్లిలో నరహరి స్మారక స్తూపాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నరహరి గ్రామంలో పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ క్రమంలో మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు వస్కుల సూర్యం, చవ్వా భిక్షం, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే

కొండమల్లేపల్లి : ఆత్మ రక్షణకు కరాటే విద్య నేర్చుకోవాలని కరాటే మాస్టర్స్ ధనుష్, ఖలీమ్, మింటూలు అన్నారు. కరాటే మాస్టర్ కోటి పేరిట కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మెటిల్డా స్కూల్‌లో ఉచిత కరాటే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వేసవి సెలవుల సందర్భంగా నిర్వహిస్తున్న కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రిటైర్డ్ జడ్జి మృతి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ కోర్టులో స్పెషల్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తించిన రిటైర్డ్ జడ్జి పి.లక్ష్మీనారాయణ బుధవారం మృతి చెందాడు. పట్టణంలోని విద్యానగర్‌లో నివాసముంటున్న ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన మృతిపై మిర్యాలగూడ బార్ అసోసియేషన్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు సంతాపం ప్రకటించారు.

కార్మిక. కర్షక పోరాట కేంద్రాలుగా మార్చుకోవాలి

మిర్యాలగూడ : గ్రామాలను కార్మిక, కర్షక పోరాట కేంద్రాలుగా మలుచుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో మే డే ఉత్సవాల్లో భాగంగా జెండాను ఎగురవేసి మాట్లాడారు. కేంద్రం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, మండల కార్యదర్శి కన్నెకంటి రామకృష్ణ, నాయకులు సీతారాములు, వస్కుల సూర్యం, నీరజ, సైదులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర : మండలంలోని పులిచర్ల గ్రామానికి చెందిన డి.సముద్రానికి మంజూరైన రూ.60వేల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి బుధవారం మిర్యాలగూడెంలోని క్యాంపు కార్యాలయంలో అందించారు. సముద్రం అనారోగ్యానికి గురి కావడంతో హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేశారు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.60వేలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంలా మారిందన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఈనెల 15 నుంచి 17 వరకు జరిగే బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా బుధవారం నాభిశిల ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. పులివెందులకు చెందిన దేశ గురువు రామాంజనేయ స్వామి, వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బొడ్రాయిని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సరస్వతమ్మ, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, దేవాలయ చైర్మన్ నాయిని మాధవరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంఏ.సిరాజ్‌ఖాన్, యుగేంధర్‌రెడ్డి, సురేష్, బూడిద వెంకటయ్య, మల్లేష్‌యాదవ్, బోడ కుమార్, నల్లగాసు అనిల్, వార్డు సభ్యులు, పురోహితులు పాల గణపతిశర్మ, శివప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

చందంపేట : అత్యవసర సమయాల్లో, ప్రాణాపాయస్థితిలో ఏ విధంగా సీపీఆర్ చేయాలనే అంశంపై బుధవారం చందంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందులాల్ మాట్లాడుతూ గుండెపోటు, అత్యవసర సమయాల్లో, ప్రాణాపాయ స్థితిలో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు నాయక్, ఎంఈఓ సామ్యనాయక్, ఏఎస్ఐ విల్సన్, శరత్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం లేక.. రాశులు కదలక

- ధర్మపురంలో ధాన్యం కొనుగోళ్లపై సందిగ్ధత
- నెల రోజులుగా వేచి చూస్తున్న రైతులు
- అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు



ధర్మపురం ఐకేపీ కేంద్రంలో ధాన్యం రాశులు



మొలకొచ్చిన ధాన్యం

మాడుగులపల్లి : ఆరుగాలం శ్రమించిన రైతులు ధాన్యాన్ని అమ్ముకునేందుకు అరిగోస పడుతున్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించినా కొనుగోలు చేయడంలో క్షేత్రస్థాయిలో జాప్యం జరుగుతోంది. కొన్నిచోట్ల కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండడం.. ఈ లోగా అకాల వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

ధర్మపురంలో కేంద్రం ఏర్పాటుపై సందిగ్ధత

ధర్మపురంలో రైతులు వందల ఎకరాల్లో వరి సాగు చేశారు. సన్నాలు సాగు చేసిన వారు పంట కోసి నేరుగా మిల్లులకు తరలించగా.. దొడ్డు రకం సాగు చేసిన వారు ఐకేపీ కేంద్రం ఉంటుందన్న ఆశతో ధాన్యం పోసి నానా అవస్థలు పడుతున్నారు. నెల రోజులు గడుస్తున్నా.. కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై స్పష్టత లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఎందుకీ సమస్య ..

ధర్మపురంలో రెండేళ్ల నుంచి ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ సారి కూడా కొనుగోలు చేస్తారని భావించిన రైతులు అక్కడ ధాన్యం పోశారు. కానీ ఇప్పటి వరకు కేంద్రం కేటాయింపు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో కేంద్రాన్ని నిర్వహించిన సంఘ బంధం సభ్యులు నిర్వహణకు నిరాకరించడంతో మరో సంఘానికి చెందిన వారు ముందుకు వచ్చారు. స భ్యుల్లో కొందరు నిరక్షరాస్యులని, ట్యాబ్ ఎంట్రీ, బుక్ ఎంట్రీల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న కారణంతో తమకు కేంద్రం కేటాయింపునకు అధి కారులు నిరాకరించినట్లు ఓ సభ్యురాలు ఆరోపిస్తున్నారు. కానీ నిబంధనల మేరకు ఐకేపీ కేంద్రం ఏర్పాటుకు 10వేల క్వింటాళ్ల ధాన్యం అందుబాటులో ఉండాల్సి ఉండగా.. కేవలం 5వేల క్వింటాళ్లే ఉండడంతో నిర్వాహకులకు ఆర్థికంగా గిట్టుబాటయ్యే అవకాశం లేకపోవడంతో నిరాకరించినట్లు ఏపీఎం చెబుతున్నారు. దాంతో ధాన్యం కొనుగోలు కేంద్రం కేటాయింపుపై సందిగ్ధత నెలకొని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా నిడమనూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా సంఘంలోని ఓ సభ్యురాలు ఈ ప్రక్రియకు అడ్డుపడుతోందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అకాల వర్షాలు కురుస్తున్న సమయంలో ఎన్నిరోజులు తాము రాశులను కాపాడుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇక్కడ 10 వేల క్వింటాళ్లకు పైనే ధాన్యం ఉంటుందని రాజకీయ జోక్యం కారణంగానే కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ధాన్యం పోసి నెలరోజులైంది



గతంలో ఇక్కడ ఐకేపీ కేంద్రం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేశారు. ఈ సారి కూడా ఉంటుందన్న ఆశతో ధాన్యం పోశా. కానీ నెలరోజులుగా కొనుగోళ్లు జరగడం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి రాశుల కింద నీరు చేరి ధాన్యం కొంత మొలకొచ్చింది. త్వరగా కొనుగోళ్లను పూర్తి చేయాలి

– మొగుళ్ల సైదులు, ధర్మపురం, రైతు

నిబంధనల మేరకే ఐకేపీ కేంద్రం ఏర్పాటు

ఐకేపీ కేంద్రం ఏర్పాటుకు 10 వేల క్వింటాళ్ల ధాన్యం అందుబాటులో ఉండాలి. కానీ ధర్మపురంలో కేవలం 4వేల క్వింటాళ్లు మాత్రమే అందుబాటులో ఉంది. కేంద్రం నిర్వాహకులు అక్షరాస్యులై నిర్వహణ ఖర్చులకూ మూలధనం ఉండాలి. కొత్తగా ఐకేపీ కేంద్రం నిర్వహణకు దరఖాస్తు చేసుకున్న సంఘం బంధం సభ్యులకు ఇవేవీ లేకపోవు.

– నిజామొద్దీన్, ఏపీఎం, మాడుగులపల్లి

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్



వృద్ధులకు కళ్లజోళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కోరారు. బుధవారం దేవరకొండ మండల పరిధిలోని అంబటోని గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్వహించే క్యాంపుల్లో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి కళ్లజోళ్లను అందిస్తున్నట్లు తెలిపారు. సంపూర్ణ అంధత్వ నివారణకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, సర్పంచ్ అంజయ్య, శ్రీనునాయక్, హరికృష్ణ, బొడ్డుపల్లి కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదలకు మేలు

హాలియా : కంటి వెలుగు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, నాగార్జున సాగర్ ఎడమ కాల్వ మాజీ వైస్ చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హాలియా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని 11వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న రోగులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, కౌన్సిలర్ అన్నెపాక శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు డోమినిక్, బీఆర్ఎస్ నాయకులు వడ్డే సతీష్‌రెడ్డి, ముజ్జ శ్రీహరి, మధుబాబు, గంగా భవాని, సురుగు నారాయణ, మాధవరం నరేందర్‌రావు, శ్రీనివాస్ చౌదరి, నారాయణరావు, దుర్గారావు, జహీరుద్దీన్, సీకే రమేష్, మల్లిఖార్జున్ గౌడ్, పాల్గొన్నారు.

790 బస్తాల తడిసిన ధాన్యం కొనుగోలు



తడిసిన ధాన్యం లారీలోకి ఎత్తిస్తున్న తహసీల్దార్

డిండి : మండల పరిధిలోని గోనబయనపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రంలో బుధవారం కురిసిన వర్షానికి తడిసిన 790 బస్తాల వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. అకాల వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిందన్న సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వరిధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత రైతులతో మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎలాంటి ఆందోళన చెందొద్దని ఆయన రైతులకు భరోసా కల్పించారు.

ఓయూ ఫిజిక్స్ హెచ్‌ఓడీగా ప్రొఫెసర్ శ్రీనివాస్



త్రిపురారం : మండలంలోని అప్పలమ్మ గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సూర్య తండాకు చెందిన ప్రొఫెసర్ ఎం శ్రీనివాస్ ఓయూ ఫిజిక్స్(భౌతిక శాస్త్రం) హెచ్ఓడీగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే ప్రధాన యూనివర్సిటీల ఫిజిక్స్ విభాగం బీఓఎస్(బోర్డు ఆఫ్ స్టడీస్)చైర్మన్‌గా పని చేస్తున్నారు. గతంలో టీఎస్ సెట్ కోఆర్డినేటర్‌గా, టెక్నాలజీ విభాగం ఇన్‌చార్జ్ హెడ్‌గా, యూనివర్సిటీ సైన్స్ కళాశాల సైఫాబాద్‌లో అపాయింట్ అయ్యి ఫిజిక్స్ ఇన్‌చార్జ్ హెడ్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఓయూ ఫిజిక్స్ పరిశోధన విద్యార్థి సిగిలంపట్ల పరుశురాంలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఎమ్మెల్యే నోముల భగత్



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నోముల భగత్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఏమైన పెండింగ్‌లో సమస్యలు ఉంటే తక్షణమే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రార్థన దినం క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈనెల 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న క్రిస్టియన్ బహిరంగ సభ పోస్టర్లను నియోజకవర్గ పాస్టర్లతో కలిసి ఎమ్మెల్యే నోముల భగత్ ఆవిష్కరించారు. అలాగే గుర్రంపోడు చెందిన 24 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ. 7లక్షల 33వేల విలువ చేసే చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజేందర్‌రెడ్డి, గుర్రంపోడు ఎంపీపీ వెంకటేశ్వర్లు, యూనైటెడ్ ఇండియన్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు బెజవాడ రవికుమార్, ఎంపీపీ జయమ్మ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోలే డేవిడ్, రాష్ట్ర క్రిస్టియన్ సమితి జిల్లా అధ్యక్షుడు పెద్దమాము డేవిడ్‌రాజ్, నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు నంద్యాల ఎలీషారావు, ట్రెజరర్ సమేలు, వైస్ ఎంపీపీ ధనుంజయ, నాయకులు ప్రవీణ్, ఎంపీటీసీ చంద్రమౌళి, సర్పంచ్‌లు చక్రవర్తి, రామచంద్రం, యాదగిరిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధు, కౌన్సిలర్ నల్లబోతు వెంకటయ్య, కోఆప్షన్ సభ్యుడు చాపల సైదులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి

త్రిపురారం : ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని బొర్రాయిపాలెంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేద మంత్రోచ్చరణల నడుమ అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, ఆలయ నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రా రెడ్డి, ఆలయ చైర్మన్ బిట్టు నర్సయ్య, బీఆర్ఎస్ మహిళ అధ్యక్షురాలు మాధా ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సుమన్‌రెడ్డికి ఉత్తమ ఫొటో జర్నలిస్టు అవార్డు

వేములపల్లి : మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన దొంతిరెడ్డి సుమన్‌రెడ్డికి హై బిజ్ మీడియా– 2023 అవార్డ్సులో భాగంగా ఉత్తమ ఫొటో జర్నలిస్టు అవార్డు అందుకున్నాడు. బుధవారం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, ఎంపీ రంజిత్‌రెడ్డిలు సుమన్‌రెడ్డికి అవార్డు అందజేశారు. సుమన్‌రెడ్డి 15ఏళ్లుగా జాతీయ ఆంగ్ల దినపత్రిక ది టైమ్స్ ఆఫ్ ఇండియాలో సీనియర్ ఫొటో జర్నలిస్టుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇప్పటివరకు పలు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించి ఫొటో కాంపిటీషన్‌లో సుమన్‌రెడ్డి అవార్డులు అందుకున్నాడు.



అవార్డు అందుకుంటున్న సుమన్‌రెడ్డి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నాగార్జునసాగర్ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. బుధవారం పెద్దవూర మండలంలోని చలకుర్తి సెక్టార్ పరిధిలో గల హిల్‌కాలనీలోని 1, 5వ అంగన్‌వాడీ కేంద్రాల్లో ×బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ గర్భిణులు పోషకాలు ఎక్కువగా ఉండే ఆకు కూరలను తీసుకోవాలన్నారు. సెలవుల్లో ఆత్మరక్షణ కొరకు కరాటే నేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గౌసియాభేగం, అంగన్‌వాడీ టీచర్లు సుదర్శనమ్మ, ప్రియాంక తదితరులు ఉన్నారు.



హిల్‌కాలనీలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

జేపీఎస్‌లను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలి



మాడుగులపల్లి : జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న బీఎస్పీ నాయకుడు శ్రీనివాస్



దేవరకొండలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జేపీఎస్‌లు

మాడుగులపల్లి : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని బీఎస్పీ నియోజకవర్గ నాయకుడు కుక్కముడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జేపీఎస్‌లు చేస్తున్న నిరవధిక సమ్మెకు పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆయన మద్దతు ప్రకటించిన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పుట్టల దినేష్, ఇంద్రపెల్లి సైదులు, కొండ భరత్ తోపాటు జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూనియర్‌పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో కత్తి వాసుదేవారెడ్డి, శ్రీనివాస్, దీరావత్ సురేష్, ప్రవీణ్, ఆది పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ జన సమితి పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన జన సమితి పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, సతీష్, శివ, ఉదయ్, ఇద్దయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

డిండి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, గాయాల రాఘవేంద్ర, సాయికుమార్, జేపీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్)ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ దేవరకొండ డివిజన్ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన జేపీఎస్‌లు బుధవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడారు. అంతకుముందు పట్టణంలోని డా.బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, సంధ్య, విజయ్, రమేష్, స్వామి, అనిల్, రమేష్‌గౌడ్, జైహిందర్, నిరంజన్, శైలేందర్, హరిత, రాజేశ్వరి, శ్రీకాంత్, నవీన్, వేణు, వెంకటేశ్వర్లు, శిరీష, సాది యా, దివ్య, ప్రియాంక, నీలిమ పాల్గొన్నారు.

హాలియా : నాలుగేళ్ల ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేసేంత వరకు ప్రభుత్వంపై పోరాడుతామని అనుముల మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె బుధవారం నాటికి ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ల వెంకన్న, రియాజ్, లక్ష్మి నారాయణ, గోవర్ధన్, గిరి. రాము, జాన్, శ్రీనివాస్, మధు, సైదులు, వెంకన్న, సంతోష్, సుహాసిని, సునిత, మల్లీశ్వరీ ఉన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు ఏవీరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యలయంలో పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న నిరవధిక సమ్మెకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజనేయులు, రవి, ధర్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, మోహన్, పంచాయతీ కార్యదర్శులు నవీన్,రామచంద్రం,రాంబాబు, శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ యజమానికి కుచ్చుటోపీ!

- రూ. 2 లక్షలతో ఉడాయించిన సూపర్‌వైజర్

మాడుగులపల్లి : మండలంలోని కుక్కడం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ యజమానికి సూపర్‌వైజర్ కుచ్చుటోపీ పెట్టి రూ. 2 లక్షలతో ఉడాయించినట్లు సమాచారం. సూర్యాపేటకు చెందిన వ్యక్తి కొంతకాలంగా త్రిపురారంలో నివాసం ఉంటూ కుక్కడం గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. నమ్మకంగా ఉంటూ బంక్‌లో రూ. రెండు లక్షల నగదు పక్కదారి పట్టించాడు. రెండురోజులుగా అతడు విధులకు హాజరుకాకపోవడం.. లెక్కల్లో తేడా ఉండడంతో అనుమానం వచ్చి యజమాని అతడికి ఫోన్ చేయగా ఎంతకూ స్పందించ లేదు. ఆచూకీ కోసం ఆరా తీసినా కనిపించకపోవడంతో డబ్బుతో ఉడాయించినట్లు నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇదే వ్యక్తి కుక్కడం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.3 లక్షలు అప్పుగా సైతం తీసుకున్నట్లు సమాచారం.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మిర్యాలగూడ అర్బన్ : వాణిజ్య, వ్యాపార సముదాయాల నిర్వాహకుల్లోనే కాకుండా వీధుల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని పలు వ్యాపార సముదాయాలను సందర్శించిన అనంతరం సీసీ కెమెరాలు ఏర్పాటు అవి పని చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమరాలు ఏర్పాటు ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు 45రోజుల పాటు ఉండేలా బ్యాకప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏదైనా సంఘటనలు జరిగిన సమయంలో సీసీ టీవీ ఫుటేజీలు కీలకంగా మారుతాయని తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ

ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

డిండి : మండల కేంద్రంతోపాటు గోనకోల్, చెర్కుపల్లి, గోనబోయనపల్లి, తవక్లాపైర్ గ్రామాల్లో ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ వేడుకలు బుధవారం ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎనమల్ల నవీన్ ముఖ్య అతిథిగా హాజరై ఆ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కనకాచారి, సహాయకార్యదర్శి శైలేష్,వంకేశ్వరం చక్రీ, వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ నాయకులు ఆర్కపల్లి బట్టు, నాయక్ మధుకర్, అనిల్, విజయ్, భాను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలకు భోజనాలు

వేములపల్లి : మండలంలోని సల్కునూరులో ఉపాధి హామీ పనులు చేపడుతున్న 500మంది కూలీలకు మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ బుధవారం భోజనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కూలీలు ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకోని మాట్లాడారు. ఎండనక, వాననక పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. పని చేసిన మరుసటి రోజు కూలీల ఖాతాల్లో డబ్బులు జమా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూలీలు పాల్గొన్నారు.



కూలీలకు భోజనాలు అందజేస్తున్న శ్రీనివాస్

చెరువు మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

మాడుగులపల్లి : మండల కేంద్రంలోని నల్లచెరువు మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తున్నారంటూ గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. చెరువు నుంచి మట్టిని తరలిస్తుండగా గుర్తించి అక్కడికి చేరుకొని టిప్పర్లను, జేసీబీలను నిలిపివేశారు. అనుమతులు లేకుండా మట్టిని వ్యాపార అవసరాలకు తరలిస్తున్నారని ఆక్షేపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గ్రామస్తులకు సర్ది చెప్పారు. కాగా విషయంపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివశంకర్‌ను వివరణ కోరగా.. రోడ్డు నిర్మాణం కోసం మట్టి తరపునకు ఓ కాంట్రాక్టర్ అన్ని అనుమతులు తీసుకున్నారని, మైనింగ్ శాఖ సైతం మట్టి తవ్వకానికి అనుమతులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

జాతరకు ముస్తాబైన బంగారు మైసమ్మతల్లి ఆలయం



జాతరకు ముస్తాబైన ఆలయం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కల్లెపల్లి గ్రామంలో కొలువైన బంగారు మైసమ్మతల్లి జాతర ఈనెల 6 నుంచి 8వరకు నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని కమిటీ సభ్యులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వందేళ్ల చరిత్ర కలిగిన కల్లెపల్లి బంగారు మైసమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిగా పేరుగాంచింది. ప్రతి గురు, ఆదివారాల్లో మొక్కులు తీర్చుకునేందుకు భారీగా భక్తులు తరలి వస్తుంటారు. ఈనెల 6న నూతనంగా తయారు చేసిన ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకురావడంతో జాతర ప్రారంభమవుతుంది. 7న అమ్మవారికి పంచామృతాభిషేకం, చంద్రపట్నం, 8న బోనాలు సమర్పిస్తారు. అనంతరం ఉత్సవమూర్తులను కల్లెపల్లి గ్రామంలో ఊరేగించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణధికారి గుజ్జుల కొండారెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ పాచ్చునాయక్‌లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, క్యూలైన్లు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఆలయ సమీపంలోనే గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరం కూడా ఏర్పాటు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొననున్నారు.